## క్లుప్తంగా

### పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదు



గణితంపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి పుస్తక పఠనాన్ని మించిన సాధనం లేదని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించడం, పద్యాలు కంఠస్థం చేయించడం, చిత్రలేఖనం, భక్తిగీతాలు నేర్పించడం, స్పోకెన్ ఇంగ్లిష్, గణితం తదితర అంశాల్లో మెలకువలు నేర్పించారు. విరామ సమయంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి గ్రంథాలయాధికారి మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకపఠనంపై ఆసక్తి పెంచడం, విద్యావంతులుగా తీర్చిదిద్దడం, వారి ఉజ్వల భవితకు బాటలు వేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

బంగారుపాళెం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించని, లేని పక్షంలో ఈ నెల 20వ తేదీ నుంచి సమ్మె చేపడతామని సోమవారం ఎంపీడీఓ శ్రీధర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. మధు మాట్లాడుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బంగారుపాళెం, తగ్గువారిపల్లె గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ర్యాలీ



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం చెర్లోపల్లిలో సోమవారం ఎస్వీ యూనివర్సిటీ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు జాతీయ సేవా పథక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా సేవా పథక కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ వరకు గ్రామంలో చేపట్టనున్నారు. తొలిరోజు ర్యాలీ చేశారు. అనంతరం రైతులు సాగు విశేషాలు, కష్ట నష్టాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్ నిర్వాహకులు శైలజ, ప్రశాంతి, ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

సంతపేటలో ఎలక్ట్రానిక్ పరికరంతో తీర్చిదిద్దిన అమ్మవారి ప్రతిమ, కొంగారెడ్డిపల్లిలో అమ్మవారి మండప ముఖద్వారం, నడివీధి గంగమ్మ మండపం



# నగరం.. అమ్మోరి సంబరం

- నేడు చిత్తూరులో గంగజాతర
- విద్యుత్ దీపాలతో అలంకరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలో నేడు అమ్మోరి సంబరం ఆరంభం కానుంది. పొరుగు ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులతో నగరమంతా సందడిగా మారింది. భక్తులు విశేషంగా ఆరాధించే గ్రామదేవత నడివీధి గంగమ్మ దర్శనానికి భక్తులు తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు. నగరంలో వాడవాడలా గంగమ్మ మండపాలు కొలువుదీరాయి. విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది. నేటి ఉదయం నుంచే జాతర సందడి మొదలవుతుంది.



సంతపేటలో విద్యుత్‌దీపాలంకరణ

మరుసటి రోజు నిమజ్జనంతో జాతరను ముగించనున్నారు.

చిత్తూరు నగరం గంగజాతరకు సిద్ధమైంది. చిత్తూరు బజారువీధి, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, సంతపేట, దొడ్డిపల్లి, కట్టమంచి, మంగసముద్రం, ఓబన్నపల్లి తదితర ప్రాంతాల్లో జాతరకు 15 రోజుల ముందు నుంచే ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టారు. భారీ స్థాయిలో చలువ పందిళ్లు, వాటికి వస్త్రాలంకరణ, క్యూలు, అమ్మవారి ప్రతిమలతో విద్యుత్ దీపాలంకరణలు, తోరణాలు ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించేందుకు కావాల్సిన సామగ్రిని తీసుకొచ్చి అందుబాటులో ఉంచారు. సోమ, మంగళవారాల్లో చిత్తూరులో జన జాతర కనిపించనుంది.

**గట్టి నిఘా...**

చిత్తూరు గంగజాతరను తిలకించేందుకు ఉమ్మడి రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తనున్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు అధిక సంఖ్యలో రానున్నారు. దీంతో పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అన్ని మండపాల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. దీనికి తోడు పోలీసు బలగాలను భారీగా మోహరించింది. అమ్మవారు మండపాల వద్ద అనుమానిత వ్యక్తుల కదిలికలపై అడుగడుగున నిఘా పెడుతోంది.




**ఆకట్టుకున్న ఎలక్ట్రానిక్ ప్రతిమ**

నగరంలోని సంతపేటలో కొలువుదీరిన ఎలక్ట్రానిక్ గంగమ్మ శిరస్సు విశేషంగా ఆకట్టుకుంటోంది. గంగమ్మ కళ్లు మూస్తూ తెరుస్తూ ఉండేలా సెట్ చేశారు. అమ్మవారి తలపైభాగంలో గొడుగు తిరుగుతూ ఉంటే, దేవకన్యలు వింధ్యమరలు విసురుతున్నట్లు ఏర్పాట్లు చేసిన సెట్టింగ్ ప్రజలను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

యాదమరి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి మండల వైద్యాధికారి డాక్టర్ సురేఖ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న నర్సుల సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రతి రోగిని ఆప్యాయంగా పలకరించి వారికి అవసరమైన సేవలను అందించి తమ కుటుంబ సభ్యుల్లాగా భావిస్తున్నారని తెలిపారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా సేవలు అందిస్తున్న ప్రభావతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సెల్వరాణి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



నర్సులను సన్మానిస్తున్న సిబ్బంది

## ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి విచ్చేసిన 60 మంది కంటి జబ్బు రోగులకు పరీక్షలు చేశారు. అందులో 35 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఎంపికైన వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



రోగులకు పరీక్ష చేస్తున్న సిబ్బంది

## త్వరలోనే చిత్తూరు హై రోడ్డు విస్తరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని హైరోడ్డును వీలైనంత త్వరలోనే విస్తరిస్తామని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు తాండవమూర్తి, నాయకులు మురళి, సత్య తదితరులు హైరోడ్డు విస్తరణపై కమిషనర్‌తో మాట్లాడారు. అధికారులు స్పందిస్తూ హైరోడ్డును వంద అడుగుల వెడల్పుతో విస్తరించడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. టీడీఆర్ బాండ్లతో ముందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఇక పలువురు ప్రజలు సైతం వారి సమస్యలను వినతులు రూపంలో అందజేశారు. ఆర్థిక అంశాలతో ముడిపడని వి నతులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్య లు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజా వేదికలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.



ప్రజల వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

## రెండు రోజులు మద్యం బంద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు మద్యం విక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. నగర పరిధిలో రెండు రోజుల పాటు గంగమ్మ జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని 15 మద్యం దుకాణాలు, 7 మద్యం బార్లు, ఓ మిలటరీ క్యాంటీన్‌ను మూసేస్తున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిగితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వ్యాస, వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని రెడ్‌క్రాస్‌లో సోమవారం వ్యాస, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు పలు పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన 9వతరగతి విద్యార్థి అఫ్రీన్ నవాజ్ ఖాన్ ప్రతిభ బహుమతిని సొంత చేసుకుంది. సభ్యులు బాలకృష్ణారెడ్డి, సహదేవనాయుడు తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

## 62 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

తవణంపల్లె: మండల కేంద్రంలోని జీసెస్ గాస్పెల్ చర్చిలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు 62 మంది పరీక్షలు చేయించారు. కంటిలో సమస్య ఉన్న గుర్తించి ఆపరేషన్ కోసం 20 మందిని ఎంపిక చేశారు. ఉచితంగా ఆపరేషన్ కోసం ఆస్పత్రి సిబ్బంది సొంత వాహనంలో చెన్నైకు తరలించారు. ఫాస్టర్ ఏసు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.



కంటి పరీక్షలకు హాజరైన రోగులు

# అర్ధగిరి క్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ ఈఓ హనుమంతురావు పర్యవేక్షణలో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి అభిషేకం, గంధంతో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం గంధం అలంకరణలో స్వామి భక్తులకు దర్శభాగ్యం కల్పించి కటాక్షించారు. అర్ధగిరికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఆలయంలో ఉచిత ప్రసాదాలను అందజేశారు.

**భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం**

పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని వేదపండితులచే ఆలయ ఆవరణలో ఉభయదారులచే భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. హోమంలో ఆలయ ఈఓ హనుమంతురావు,ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. రాత్రి ఉత్సవమూర్తికి అభిషేకం పూజలు చేయించి ప్రాకారోత్సవం చేయించారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్ధగిరికి విచ్చేసిన భక్తులు కాలక్షేపానికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



కాణిపాకం: సత్యనారాయణ వ్రతంలో భక్తులు, గుడిపాల: మహా రాజరాజ అలంకారంలో వీరబ్రహేంద్రస్వామి

**ఘనంగా చిత్ర పౌర్ణమి వేడుకలు**

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో వెలసిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో సోమవారం చిత్రపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, పాలాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు స్వామివారికి పుష్పాలంకరణ చేసి నైవేద్య కార్యక్రమం చేశారు. అన్నదానం చేశారు. సాయంత్రం ఆరు గంటలకు స్వామి వారి అష్టోత్తర శతనామావళి కార్యక్రమం నిర్వహించి కలశపూజ, చంద్రపూజ జరిపారు. శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారు మహారాజరాజ అలంకారంలో పుష్ప పల్లకి సేవలో మంగళ వాయిద్యాల నడుమ రామాపురం గ్రామ వీధుల్లో స్వామివారి సతీసమేతుడై అభయ హస్తములతో భక్తులందరికీ దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

**ఘనంగా పౌర్ణమి పూజలు**

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలు చేయించారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు.



తవణంపల్లె: సుదర్శన హోమం పూర్ణాహుతిలో ఈఓ హనుమంతురావు



తవణంపల్లె: వైభవంగా ప్రాకారోత్సవం

## జాతరకు అంతరాయం లేని విద్యుత్

చిత్తూరు కార్పొరేషన్: గంగమ్మ జాతర సందర్భంగా డివిజన్ పరిధిలో ఎక్కడా విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్లు కలిపి మొత్తం 30 మంది సిబ్బంది అమ్మవారిని ప్రతిష్ఠించిన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ సరఫరాకు అంతరాయం వస్తే వారు పునరుద్ధరణ పనులు చేపడతారన్నారు. భక్తులు విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలన్నారు. వైర్లను ముట్టుకోవడం, లాగడం వంటివి చేయరాదన్నారు. సమస్య ఉంటే నిర్వాహకులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

## ఇక్కడ విద్యుత్ సేవలు పొందండి

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో పరిధిలో డివిజన్ల పునర్విభజన జరగడంతో వినియోగదారులు సూచించిన ఈఆర్వో (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు)లో విద్యుత్ సేవలు పొందాలని ఈఈ మునిచంద్ర సోమవారం తెలిపారు. చిత్తూరు గాంధీరోడ్డులోని ఈఆర్వో కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల వినియోగదారులు సేవలు పొందవచ్చని చెప్పారు. స్థానిక గిరింపేటలోని ఈఆర్వోలో జీడీనెల్లూరు, పెనుమూరు, ఆవులకొండ, పాలసముద్రం మండలాల వినియోగదారులు బిల్లులు చెల్లించాలన్నారు. గతంలో గాంధీరోడ్డు చిత్తూరు నియోజకవర్గం, జీడీనెల్లూరు, పెనుమూరు, ఆవులకొండ, పాలసముద్రం మండలాల వినియోగదారులు బిల్లులు చెల్లించే అవకాశం ఉండేదన్నారు. గిరింపేట ఈఆర్వోలో బంగారుపాళ్యం ఆపరేషన్, రూరల్స్, యాదమరి సెక్షన్స్ వినియోగదారులు బిల్లు కట్టేవారని చెప్పారు. ప్రస్తుతం ఈఆర్వో కార్యాలయం విభజించినట్లు తెలిపారు. విద్యుత్ బిల్లులు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు సేవలు నూతనంగా మారిన ఈఆర్వో కార్యాలయాల్లో చేసుకోవాలన్నారు. వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.